నమస్తే తెలంగాణ
ఖమ్మం
5 | ఖమ్మం, గురువారం 24 అక్టోబర్ 2024 | KHAMMAM

ప్రజలను జాగృతం చేయాలి

- భద్రాచలం ఉప ఎన్నిక, స్థానిక సంస్థల ఎన్నికలపై దృష్టి సారించాలి
- రేగా సహా బీఆర్ఎస్ భద్రాచలం నేతలకు కేటీఆర్ దిశానిర్దేశం

మాజీ మంత్రి కేటీఆర్‌కు శ్రీరాముడి ప్రతిమను అందజేస్తున్న భద్రాచలం నేతలు

భద్రాచలం/ మణుగూరు టౌన్, అక్టోబర్ 23: కాంగ్రెస్ ప్రభుత్వం చేపట్టే ప్రజా వ్యతిరేక నిర్ణయాలను ఎండగడుతూ ప్రజలను జాగృతం చేయాలని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పిలుపునిచ్చారు. సర్కారు తప్పిదాలను ప్రశ్నించే విధంగా ప్రజలను చైతన్యం చేయాలని సూచించారు. బీఆర్ఎస్ భద్రాద్రి జిల్లా అధ్యక్షుడు, పినపాక మాజీ ఎమ్మెల్యే రేగా కాంతారావు ఆధ్వర్యంలో పార్టీ భద్రాచలం నియోజకవర్గ నాయకులు రావులపల్లి రాంప్రసాద్, మానే రామకృష్ణలు బుధవారం హైదరాబాద్‌లో కేటీఆర్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయనను శాలువాతో సత్కరించి భద్రాద్రి రామయ్య ప్రసాదాన్ని, ప్రతిమను అందజేశారు. అనంతరం ఆయన వారితో మాట్లాడారు. భద్రాద్రి జిల్లాలో పార్టీ నిర్మాణం, భవిష్యత్ కార్యాచరణ, కాంగ్రెస్ ప్రభుత్వంపై ప్రజల్లో సడలుచున్న నమ్మకం, ఆరు గ్యారెంటీల పేరుతో ప్రజలను మోసం చేసిన తీరు, దానిపై ప్రజల నుంచి వెల్లువెత్తుతున్న ఆగ్రహం తదితర అంశాలపై దిశానిర్దేశం చేశారు. భద్రాచలం ఉప ఎన్నికను, స్థానిక సంస్థల ఎన్నికలను దృష్టిలో పెట్టుకొని నిత్యం ప్రజల్లో ఉంటూ పనిచేయాలని సూచించారు. రానున్న రోజుల్లో ఏ ఎన్నిక వచ్చినా బీఆర్ఎస్ విజయం సాధించేలా ప్రత్యేక ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలని నిర్దేశించారు.

డీలర్లకు దేశీ ధ్రువపత్రాలు తప్పనిసరి

భద్రాద్రి కలెక్టర్ జితేశ్ వి పాటిల్

మాట్లాడుతున్న భద్రాద్రి కలెక్టర్ జితేశ్ వి పాటిల్

చుంచుపల్లి, అక్టోబర్ 23 : వ్యవసాయ అనుబంధ రంగాలకు చెందిన డీలర్లు తప్పనిసరిగా డిప్లొమా ఇన్ అగ్రికల్చర్ ఎక్స్‌టెన్షన్ సర్వీసెస్ ఇన్‌పుట్(దేశీ) ధ్రువీకరణ పత్రం కలిగి ఉండాలని భద్రాద్రి కలెక్టర్ జితేశ్ వి పాటిల్ అన్నారు. చుంచుపల్లి మండలం రామవరం రైతు వేదికలో 7వ బ్యాచ్ దేశీ సభ్యుల ధ్రువపత్రాల పంపిణీ కార్యక్రమం బుధవారం జరిగింది. 40 మంది వ్యవసాయ అనుబంధ రంగాల డీలర్లు 48 వారాలపాటు శిక్షణ పూర్తి చేసుకోగా.. వారికి కలెక్టర్ సర్టిఫికెట్లు ప్రదానం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విత్తనాలు, ఎరువులు, పురుగు మందుల వ్యాపారం చేస్తున్న వారికి దేశీ పేరుతో 12 నెలల డిప్లొమా కోర్సు నిర్వహిస్తున్నామని తెలిపారు. కాగా.. శిక్షణ పూర్తి చేసుకొని ధ్రువపత్రాలు తీసుకున్న వారికి కలెక్టర్ శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో డీఏవో బాబూరావు, రిటైర్డ్ అగ్రికల్చర్ ఆఫీసర్ డేవిడ్ జయపాల్, దేశీ వ్యవసాయ కోర్సు శిక్షకుడు దీపక్, రాజేశ్వరి, రంజిత్ తదితరులు పాల్గొన్నారు.

పంట నష్టపరిహారం ఇవ్వండి సారూ

కలెక్టర్, డీఏవోకు ఆళ్లపాడు రైతుల మొర

ఖమ్మం కలెక్టర్‌ను కలిసి సమస్యను వివరిస్తున్న ఆళ్లపాడు రైతులు

బోనకల్లు, అక్టోబర్ 23 : తమకు పంట నష్టపరిహారం అందలేదని, తక్షణమే తమకు న్యాయం చేయాలని కోరుతూ బోనకల్లు మండలం ఆళ్లపాడు గ్రామ రైతులు కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్, జిల్లా వ్యవసాయ అధికారి పుల్లయ్యను బుధవారం వేర్వేరుగా కలిసి విన్నవించుకున్నారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ ఆళ్లపాడులో తుపాన్ కారణంగా నష్టపోయిన రైతులకు పరిహారం అందకపోవడంతో నష్టపోయామని వాపోయారు. పంటలు వరద తాకిడికి కొట్టుకుపోయాయని ఆవేదన వ్యక్తం చేశారు. వరదలకు కొట్టుకుపోయిన పంటలు సర్వే చేయడానికి వచ్చిన అధికారుల నిర్లక్ష్యం కారణంగా అర్హులైన రైతులకు అన్యాయం జరిగిందని, కొంతమంది రైతులకు పంటనష్టం జరగకపోయినా వారికి పరిహారం వచ్చిందని వివరించారు. దీనికి కారణమైన వ్యవసాయ అధికారులపై చర్యలు తీసుకొని నష్టపోయిన రైతులకు పరిహారం చెల్లించాలని కోరారు. కార్యక్రమంలో తోటకూర వెంకటేశ్వర్లు, మల్లాది లింగయ్య, పారా వెంకటమోహన్, మల్లాది ఉపేంద్ర, నరసింహారావు, మరిది వెంకటేశ్వర్లు, లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.

పేరు పేదలది.. పెత్తనం హస్తవాసులది..

'మాది ప్రజా పాలన' అంటూ చెప్పకుంటున్న కాంగ్రెస్ నాయకులు.. నిజంగా ప్రజలు ఉండాల్సిన చోట వారిని ఉండనీయడం లేదు. ప్రజలను పక్కకు నెట్టి వారే కుర్చీలు వేసుకొని మరీ కూర్చుంటున్నారు. నిరుపేదలకు ఇళ్లు ఇచ్చేందుకేనని చెబుతూ రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేస్తున్న ఇందిరమ్మ కమిటీల్లో ఈ విషయం మరింతగా స్పష్టమవుతోంది. అసలైన పేదలు ఉండాల్సిన ఈ కమిటీల్లో అధికార పార్టీ నాయకులే నిండిపోతున్నారు. ముగ్గురు మంత్రుల అనుయాయులు ఈ స్థానాల కోసం పోటీ పడుతున్నారు. కమిటీల్లో తమ వారే ఉండాలంటూ ముగ్గురు మంత్రుల వర్గీయులు ఎవరికి వారు పట్టుబడుతున్నారు. ఈ ఒత్తిళ్ల తో అధికారులు నలిగిపోతున్నారు. దీంతో వారు చెప్పిన పేర్లతోనే కమిటీల జాబితా తయారు చేసి ప్రభుత్వానికి పంపారు.

- పేదలకు ఇళ్లిచ్చే ఇందిరమ్మ కమిటీల్లో అందరూ అధికార పార్టీ వారే..
- చైర్మన్లు, సభ్యుల్లో తమ వారే ఉండాలంటూ చోటా నాయకుల పట్టు
- మూడు గ్రూపులుగా ముగ్గురు మంత్రుల అనుచరుల పెత్తనం
- రహస్యంగా జాబితా సిద్ధం చేయించి ఇన్‌చార్జి మంత్రికి అందజేత
- బీఆర్ఎస్ సభ్యులు ఉండాల్సిన చోట కూడా తామే ఉండేలా పైరవీలు
- కొత్తగూడెంలో బీఆర్ఎస్ ప్రాతినిధ్యం ఉండగా అక్కడ కమిటీల నిలుపుదల
- భద్రాద్రి కొత్తగూడెంలో సీక్రెట్‌గా కమిటీలు.. రాష్ట్ర ప్రభుత్వానికి చేరిన పేర్లు..
- జిల్లాలో మొత్తం 584 కమిటీలకుగాను 545 పూర్తి.. 39 పెండింగ్..

భద్రాద్రి కొత్తగూడెం, అక్టోబర్ 23 (నమస్తే తెలంగాణ) : పేదలకు ఇందిరమ్మ ఇళ్లు ఇస్తామంటూ హామీ ఇచ్చిన కాంగ్రెస్ సర్కారు.. ఆ ఇళ్లకు లబ్ధిదారుల ఎంపిక కోసం ఇందిరమ్మ కమిటీలను వేయాలని నిర్ణయించింది. ఇందుకోసం మార్గదర్శకాలను రూపొందించింది. వీటి ప్రకారం.. గ్రామాల్లో పంచాయతీ కమిటీలను, పట్టణాల్లో మున్సిపల్ వార్డు కమిటీలను ఏర్పాటు చేస్తోంది. గ్రామాల్లో అయితే సర్పంచ్ చైర్మన్‌గా, పంచాయతీ కార్యదర్శి కన్వీనర్‌గా ఉంటారు. పట్టణాల్లో అయితే మున్సిపల్ కౌన్సిలర్ చైర్మన్‌గా, వార్డు అధికారి కన్వీనర్‌గా ఉంటారు. వీరి సమక్షంలో ఉండే కమిటీల్లో ఐదుగురు సభ్యులు ఉంటారు. ఇందులో ఎస్సీ, ఎస్టీ, బీసీ వర్గాల నుంచి ఒక్కొక్కరు; స్వయం సహాయక సంఘాల మహిళల నుంచి ఇద్దరు ఉంటారు. ఇప్పుడు పంచాయతీలకు పాలకవర్గాలు లేనందున అక్కడి ప్రత్యేకాధికారే చైర్మన్‌గా ఉంటారు. పంచాయతీ ఎన్నికలయ్యాక వచ్చే నూతన సర్పంచే చైర్మన్ అవుతారు. అయితే ఇప్పుడు సభ్యుల్లో అందరినీ తమవారినే నియమించుకొని కమిటీలన్నింటినీ తమ గుప్పిట్లో పెట్టుకోవాలని అధికార పార్టీ నేతలు పన్నాగం పన్నారు. గ్రామసభల ద్వారా ఇందిరమ్మ కమిటీలు ఏర్పాటు కావాల్సి ఉన్నప్పటికీ జిల్లాలో ఎక్కడా అలా జరగలేదు. ఇప్పటికే రహస్యంగా కమిటీల ఎంపిక పూర్తయింది. ముగ్గురు మంత్రుల అనుయాయులు ఎవరికి వారుగా అధికారులపై ఒత్తిడి తెచ్చి తమ వారి పేర్లతో ఇందిరమ్మ కమిటీల జాబితాను తయారు చేయించి ఇన్‌చార్జి మంత్రికి పంపించారు.

తమ వారి కోసం కాంగ్రెస్ గ్రూపుల పట్టు

ఇందిరమ్మ ఇళ్లు ఇచ్చేదెప్పుడో, లబ్ధిదారులు వాటిల్లో ఉండేదెప్పుడో గానీ.. వాటి కమిటీల్లో తమవారి పేర్లు పెట్టే విషయంలో మాత్రం అధికార పార్టీ నాయకుల్లో అసంతృప్తి జ్వాలలు రగులుతున్నాయి. బహిరంగంగా కమిటీలు వేస్తే వాటిల్లోని పేర్లు ముందుగానే బయటకు తెలుస్తాయి. దీంతో కమిటీల పంచాయితీ తెగేలా ఉండదు. దీంతో మూడు గ్రూపులు తయారు చేయించుకున్న జాబితాలు ఇన్‌చార్జి మంత్రి చేతికి వెళ్లాయి. దీంతో చివరికి కమిటీల్లో ఎవరి పేర్లు ఉంటాయోనని మూడు వర్గాల నాయకులు హైరానా పడుతున్నారు. అయితే, ఈ కమిటీలను ఏకపక్షంగా వేస్తున్నారంటూ చండ్రుగొండ మండలం పోకలగూడేనికి చెందిన కాంగ్రెస్ యువజన నాయకుడు.. సాక్షాత్తూ ఎమ్మెల్యేకు ఫిర్యాదు చేశాడు. చివరికి ప్రెస్‌మీట్ పెట్టిమరీ గ్రూపుల గురించి వివరించారు. కమిటీలన్నింటినీ పొంగులేటి వర్గం వాళ్లతోనే నింపుతున్నారని, తుమ్మల వర్గానికి అవకాశం ఇవ్వడం లేదని, అన్ని వర్గాలకు సమ ప్రాధాన్యం ఇవ్వాలని, అందులో తమకూ స్థానం కల్పించాలని డిమాండ్ చేశారు. అయితే, అదే గ్రామ కమిటీలో తమకూ చోటు ఇవ్వాలంటూ బీఆర్ఎస్ నాయకులు (బీఆర్ఎస్ ప్రాతినిధ్యం ఉన్న స్థానాల్లో) కోరినా పట్టించుకునే పరిస్థితి లేకపోయింది. అయితే అధికార పార్టీ నేతలు ఇచ్చిన పేర్లను గోప్యంగా ఉంచి రాష్ట్రస్థాయికి పంపినట్లు తెలిసింది.

ఇందిరమ్మ కమిటీలు ఏకపక్షమంటూ చండ్రుగొండ మండలం పోకలగూడెంలో మీడియాతో మాట్లాడుతున్న కాంగ్రెస్ నాయకులు (ఫైల్)

బీఆర్ఎస్ ప్రాతినిధ్యం ఉన్న చోటా కాంగ్రెస్ పట్టు..

చివరికి బీఆర్ఎస్ ప్రాతినిధ్యం ఉన్న చోట కూడా తమ వారి పేర్లే ఉండాలంటూ అధికార పార్టీ నేతలు పట్టుబడుతున్నారు. ఉదాహరణకు కొత్తగూడెం మున్సిపాలిటీకి బీఆర్ఎస్ చైర్‌పర్సన్ ప్రాతినిధ్యం వహిస్తున్నారు. ప్రభుత్వ ఉత్తర్వుల ప్రకారం ఇక్కడ ఇందిరమ్మ కమిటీ చైర్మన్‌గా బీఆర్ఎస్‌కు చెందిన చైర్‌పర్సన్/ కౌన్సిలర్ ఉండాలి. కానీ వారిని పక్కన పెట్టి తమ వారినే చైర్మన్‌గా ఉంచాలంటూ కాంగ్రెస్ నేతలు డిమాండ్ చేస్తున్నారు. అక్కడ కొందరు సీపీఐ కౌన్సిలర్లు ఉన్నందున వారి వార్డుల్లో వారే చైర్మన్లుగా ఉండాలి. కానీ వారిని కూడా పక్కకు నెట్టి తాము ఉంటామంటూ కాంగ్రెస్ నేతలు వాదిస్తున్నారు. దీంతో అక్కడ ఇందిరమ్మ కమిటీల ఎంపిక ప్రక్రియ నిలిచిపోయింది. ఇక్కడున్న 36 మున్సిపల్ వార్డుల్లో ఒక్కదానికి కూడా కమిటీలు వేయలేదు. జిల్లా వ్యాప్తంగా పంచాయతీ, మున్సిపల్ వార్డుల్లో కలిపి 584 కమిటీలు వేయాల్సి ఉంది. ఇందులో 481 గ్రామ పంచాయతీ కమిటీలకు గాను 478 కమిటీలు, 103 మున్సిపల్ వార్డులకుగాను 63 కమిటీలు పూర్తయ్యాయి.

ఇందిరమ్మ కమిటీలను సీక్రెట్‌గా వేశారు. గ్రామ సభ కూడా పెట్టలేదు. రహస్యంగా కమిటీలు వేస్తే రేపు ఇళ్లు ఇచ్చేటప్పుడు వారి పార్టీ వాళ్లకే ప్రాధాన్యమిస్తారు. నిజమైన

అందరి సమక్షంలో కమిటీలు వేయాలి..

పేదలకు ఇళ్లు రావడం కష్టమవుతుంది. అందుకని, అందరి సమక్షంలోనే కమిటీలు వేయాలి.

-భూపతి రమేశ్, రావికంపాడు, చండ్రుగొండ

అందరినీ సమానంగా కలుపుకుని ఇందిరమ్మ కమిటీలు వేయాలి. ఎవరికి ఇష్టం వచ్చినట్లు వాళ్లు కమిటీలు వేశారు. దీని గురించి స్థానిక ఎమ్మెల్యే దృష్టికి తీసు

ఏకపక్షంగా కమిటీలు వేశారు..

కెళ్లాం. అందరికీ ఆమోదయోగ్యంగా కమిటీలు ఉండాలి. అప్పుడే అందరికీ న్యాయం జరుగుతుంది.

-ధరావత్ శివ, యువజన కాంగ్రెస్ నాయకుడు, పోకలగూడెం, చండ్రుగొండ

జిల్లాలో 584 కమిటీలు వేయాల్సి ఉంది. అందులో 39 కమిటీలు పెండింగ్‌లో ఉన్నాయి. పంచాయతీల పరిధిలో బూర్గంపహాడ్, పినపాక, కరకగూడెం కమిటీలు,

39 కమిటీలు పెండింగ్ ఉన్నాయి..

మున్సిపాలిటీల్లో కొత్తగూడెంలోని 36 వార్డులు పెండింగ్‌లో ఉన్నాయి. త్వరలోనే వీటిల్లో కమిటీలను పూర్తి చేస్తాం.

- వేణుగోపాల్, భద్రాద్రి అదనపు కలెక్టర్

ఏఈవోల మాస్ లీవ్..

- జిల్లావ్యాప్తంగా వ్యవసాయాధికారులకు అర్జీల సమర్పణ
- పని ఒత్తిడి విషయంలో సర్కారు తీరుపై ఆందోళనకు సిద్ధం
- రాష్ట్ర జేఏసీ పిలుపు మేరకు హైదరాబాద్‌కు పయనం
- సహాయకుడిని నియమిస్తే డిజిటల్ క్రాప్ సర్వే చేస్తామంటున్న ఏఈవోలు

సత్తుపల్లి ఏడీఏకు సామూహిక సెలవుల అర్జీలను అందజేస్తున్న ఏఈవోలు

ఖమ్మం వ్యవసాయం, అక్టోబర్ 23 : ప్రస్తుతానికి ఉన్న పనులతో సతమతమవుతున్న వ్యవసాయ విస్తరణాధికారుల(ఏఈవో)పై కేంద్ర ప్రభుత్వం డిజిటల్ సర్వే అంటూ ఒత్తిడి చేయడమో.. మరే కారణమోగానీ జిల్లావ్యాప్తంగా మూకుమ్మడి సెలవుల కోసం అర్జీలు సమర్పించారు. ఏఈవోలు ఎంత పని ఉన్నా గడిచిన రెండేళ్లుగా తమ విధులను సమర్థవంతంగా నిర్వరిస్తున్నా.. ఉద్యోగ బాధ్యతల్లో భాగంగా ఏదో ఒక సర్వే చేయడం, అది ముగియగానే మరో రకమైన పనులను ప్రభుత్వం అప్పగిస్తుండడంతో విసుగు చెందుతున్నారు. గత కేసీఆర్ ప్రభుత్వం ప్రవేశపెట్టి పకడ్బందీగా అమలు చేసిన రైతుబీమా, కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పీఎం కిసాన్ పథకం, రైతు వేదిక వద్ద జరిగే అవగాహన సదస్సులు, క్రాప్ బుకింగ్ సర్వే, పంట కొనుగోలు కేంద్రాల మానిటరింగ్, నకిలీ విత్తనాలు, ఎరువులకు సంబంధించిన పరిశీలనలో ఏవో, ఏడీఏల పర్యటనల్లో పాలుపంచుకోవడం.. ఇలా అనేక రకాల పనులను ఒకవైపు ఆన్‌లైన్, మరోవైపు ఆఫ్‌లైన్‌లో నిర్వర్తిస్తున్నారు. ఇవి చాలదన్నట్లు ప్రతి సర్వే నెంబర్‌లో పొల్లుపోకుండా డిజిటల్ క్రాప్ సర్వే చేయాలని నెల రోజులుగా ఉన్నతాధికారులు తీవ్రమైన ఒత్తిడి తీసుకొస్తున్నారు. ఇందుకు సంబంధించి యాప్ డౌన్‌లోడ్ చేసుకోవాలని ఆదేశించినప్పటికీ ఇదంతా తమ వల్ల కాదంటూ రోజువారీ విధులను ఏఈవోలు నిర్వర్తిస్తున్నారు. అయితే వారి హాజరు మాత్రం అధికారికంగా నమోదు కాకపోవడంతో పలు అనుమానాలు తలెత్తుతున్నాయి. ఈ క్రమంలోనే మంగళవారం రైతుబీమాకు సంబంధించి నిర్లక్ష్యంగా వ్యవహరించారనే సాకు చూపుతూ రాష్ట్రవ్యాప్తంగా 165 మంది ఏఈవోలపై ఆయా జిల్లాల వ్యవసాయాధికారులు సస్పెన్షన్ వేటు వేయడంతో ఒక్కసారిగా ఆందోళనకు గురయ్యారు. ఎట్టి పరిస్థితుల్లోనూ ఏఈవోలను ఏదో విధంగా తప్పించాలనే ఉద్దేశంతో కక్షగట్టి పొరుగు రాష్ట్రాలకు భిన్నంగా ఇక్కడి అధికారులు వ్యవహరిస్తున్నారని పలువురు ఏఈవోలు మండిపడుతున్నారు.

అమీతుమీకి సిద్ధమైన ఏఈవోలు

రాష్ట్ర చరిత్రలో ఎన్నడూ లేని విధంగా ఏకంగా 165 మంది ఏఈవోలపై సస్పెన్షన్ వేటు వేయడంతో జిల్లాలో ఏఈవోలుగా విధులు నిర్వహిస్తున్న చిరుద్యోగులు సర్కార్ ధోరణిపై భగ్గుమన్నారు. దీంతో మూకుమ్మడి సెలవులు పెట్టాలని నిర్ణయించుకొని మంగళవారం సాయంత్రం నుంచి ఆయా డివిజన్లకు చెందిన ఏఈవోలు డివిజన్ వ్యవసాయ శాఖ సహాయ సంచాలకులకు మాస్ లీవ్‌కు సంబంధించిన ధ్రువీకరణ పత్రాలను అందజేశారు. ఈ తంతు బుధవారం ఉదయం వరకు కొనసాగింది. జిల్లా వ్యవసాయ శాఖ పరిధిలోని ఖమ్మం, మధిర, వైరా, సత్తుపల్లి, పాలేరు డివిజన్ ఏడీఏలను కలిసిన ఆయా డివిజన్‌కు చెందిన ఏఈవోలు రాష్ట్ర ఏఈవోల జేఏసీ పిలుపు మేరకు బుధవారం సాయంత్రం వరకు 99 క్లస్టర్లకు చెందిన ఏఈవోలు మాస్ లీవ్‌కు సంబంధించిన ధ్రువీకరణ పత్రాలను అందజేశారు. దీంతో మెడికల్ లీవ్, ఇతర సెలవులపై ఉన్నవారు, ఆత్మ ప్రాజెక్టు ఏటీఎం, బీటీఎంలు మినహా మిగిలిన వారంతా మూకుమ్మడిగా సెలవులు పెట్టినట్లైంది. అనంతరం అందుబాటులో ఉన్న పలువురు ఏఈవోలు రాష్ట్ర ఏఈవోల జేఏసీ పిలుపు మేరకు హైదరాబాద్ తరలివెళ్లారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వం పంతాలకు పోకుండా తమ విధి నిర్వహణ విషయంలో సాధ్యాసాధ్యాల గురించి ఆలోచించాలన్నారు. తమకు ఒక సహాయకుడిని నియమిస్తే తామే స్వయంగా పర్యవేక్షణ చేస్తూ డిజిటల్ క్రాప్ సర్వే పూర్తి చేస్తామని పేర్కొన్నారు.

భద్రాద్రి జిల్లాలోనూ..

భద్రాద్రి కొత్తగూడెం, అక్టోబర్ 23 (నమస్తే తెలంగాణ) : వ్యవసాయ విస్తరణాధికారుల(ఏఈవో)పై రాష్ట్ర ప్రభుత్వం కక్షగట్టినట్లుగా వ్యవహరిస్తున్నది. విధి నిర్వహణలో భాగంగా ప్రభుత్వం చెప్పే పనులన్నీ వరుస క్రమంలో చేస్తున్నా.. అదనంగా డిజిటల్ క్రాప్ సర్వే చేయాలని నెల రోజులుగా ఉన్నతాధికారులు తీవ్రమైన ఒత్తిడి తేవడం ఏమిటని పలువురు ఏఈవోలు ప్రశ్నిస్తున్నారు. తమకు పనిభారం తగ్గించాలని కోరుతూ వ్యవసాయ శాఖ ఉన్నతాధికారులకు బుధవారం మూకుమ్మడి మాస్ లీవ్‌ల కోసం దరఖాస్తులు సమర్పించారు. జిల్లాలో 67 మంది ఏఈవోలు విధులు నిర్వర్తిస్తున్నారు. పెద్ద జిల్లా కావడంతో పంటల విస్తీర్ణం కూడా 5 లక్షల ఎకరాలకు పైగానే ఉంది. గతంలో వారు విధుల్లో చేరినప్పుడు 4 లక్షల ఎకరాల వరకే ఉండేది. రాను రాను ధరణిలో వచ్చిన మార్పులు, పోడు భూములకు పట్టాలు ఇవ్వడంతో పంటల విస్తీర్ణం గణనీయంగా పెరిగింది. దీంతో ఏఈవోలకు పనిభారం పెరిగింది. గతంలో పంటల సర్వే చేయాలంటే సర్వే నెంబర్ల ఆధారంగా పంటల నమోదు చేయడం సులువయ్యేది. ఇప్పుడు కొత్తగా కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన క్రాప్ బుకింగ్ సర్వేపై ప్రభుత్వం కొత్త నిబంధనలు పెట్టడంతో వారంతా అభ్యంతరం తెలపడంతోపాటు మూకుమ్మడి సెలవులు పెట్టి ఆందోళనకు సిద్ధమవుతున్నారు.

ఏసీబీకి చిక్కిన లైన్ ఇన్‌స్పెక్టర్

- రూ.26 వేలు లంచం తీసుకుంటుండగా పట్టుకున్న ఏసీబీ అధికారులు
- అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించిన అధికారులు

పాల్వంచలో లైన్ ఇన్‌స్పెక్టర్ లంచం తీసుకుంటుండగా పట్టుకున్న ఏసీబీ అధికారులు

పాల్వంచ, అక్టోబర్ 23 : ఓ వ్యక్తి నుంచి రూ.26 వేల లంచం తీసుకుంటూ విద్యుత్ శాఖ లైన్ ఇన్‌స్పెక్టర్ ఏసీబీ అధికారులకు రెడ్ హ్యాండెడ్‌గా పట్టుబడ్డాడు. ఈ ఘటన భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పాల్వంచ పట్టణంలో బుధవారం చోటు చేసుకుంది. ఏసీబీ అధికారుల కథనం ప్రకారం.. పాల్వంచ మున్సిపాలిటీ పరిధిలోని కరకవాగు గ్రామానికి చెందిన గుగులోతు నాగరాజు కొత్త ఇల్లు నిర్మించుకుంటున్నాడు. ఈ క్రమంలో పక్కనే ఉన్న తన మామ ఇంటి నుంచి కరెంట్ తీసుకొని కొత్త ఇంటి అవసరాలకు వినియోగిస్తున్నాడు. దీనిని గమనించిన లైన్ ఇన్‌స్పెక్టర్ జినుగు నాగరాజు.. విద్యుత్ వినియోగిస్తున్న కొత్త ఇంటి యజమాని గుగులోతు నాగరాజుపై కేసు నమోదు చేసి, జరిమానా విధిస్తానని భయపెట్టాడు. కేసు లేకుండా చేయాలంటే రూ.65 వేలు ఇవ్వాలని లైన్ ఇన్‌స్పెక్టర్ డిమాండ్ చేశాడు. తాను అంత ఇచ్చుకోలేనని, రూ.26 వేలు ఇస్తానని ఒప్పందం కుదుర్చుకున్నాడు. తర్వాత ఏసీబీ అధికారులను ఆశ్రయించిన గుగులోతు నాగరాజు.. వారు చెప్పిన విధంగా పథకం ప్రకారం లైన్ ఇన్‌స్పెక్టర్ నాగరాజుకు లంచం డబ్బులు ఇస్తానని చెప్పి పిలిపించాడు. పాల్వంచలోని అంబేద్కర్ కూడలిలో బాధితుడు నాగరాజు నుంచి లైన్ ఇన్‌స్పెక్టర్ నాగరాజు రూ.26 వేలు లంచం తీసుకుంటుండగా అప్పటికే మాటు వేసిన ఏసీబీ డీఎస్పీ రమేశ్ వలపన్ని పట్టుకున్నారు. ఏసీబీ నిబంధనల ప్రకారం అతడిని అరెస్ట్ చేసి, రిమాండ్‌కు తరలించినట్లు డీఎస్పీ రమేశ్ తెలిపారు.

ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో కలెక్టరేట్ల ముట్టడి

- ఫీజు బకాయిల కోసం రోడ్డెక్కిన విద్యార్థులు

ఖమ్మం కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న ఏఐఎస్ఎఫ్ నాయకులు, విద్యార్థులు

భద్రాద్రి కలెక్టరేట్‌లో వినతిపత్రం అందజేస్తున్న ఏఐఎస్ఎఫ్ నాయకులు

ఖమ్మం ఎడ్యుకేషన్/కొత్తగూడెం ఎడ్యుకేషన్, అక్టోబర్ 23 : పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్‌లు విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ ఏఐఎస్ఎఫ్ ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా సమితి ఆధ్వర్యంలో విద్యార్థులతో కలిసి ఆయా కలెక్టరేట్ల ఎదుట బుధవారం ధర్నా నిర్వహించారు. తొలుత ఖమ్మం నుంచి వేలాది మంది విద్యార్థులతో కలిసి భారీ ప్రదర్శనగా వచ్చిన సంఘం నాయకులు కలెక్టరేట్‌లోకి చొచ్చుకెళ్లేందుకు యత్నించగా పోలీసులు వారిని అడ్డుకున్నారు. దీంతో పోలీసులు, విద్యార్థి నాయకుల మధ్య తోపులాట జరగడంతోపాటు స్వల్ప ఉద్రిక్తత చోటు చేసుకుంది. అనంతరం ఖమ్మంలో ఏఐఎస్ఎఫ్ జాతీయ కార్యవర్గ సభ్యుడు ఇటికాల రామకృష్ణ, భద్రాద్రి కొత్తగూడెంలో సంఘం జిల్లా కార్యదర్శి ఎండీ ఫహీం మాట్లాడారు. విద్యార్థులపై వివక్ష చూపిన ప్రభుత్వాలు మనుగడ సాధించలేదన్నారు. రాష్ట్రవ్యాప్తంగా ఫీజు రీయింబర్స్‌మెంట్, నాన్ ప్రొఫెషనల్ రూ.2 వేల కోట్లు, ప్రొఫెషనల్ రూ.4 వేల కోట్ల ఉపకార వేతనాలు పెండింగ్‌లో ఉన్నాయన్నారు. వాటిని విడుదల చేయకపోవడంతో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. తక్షణమే పెండింగ్ బిల్లులు మంజూరు చేయకపోతే మంత్రుల ఇళ్లను ముట్టడిస్తామని హెచ్చరించారు. ఆయా కార్యక్రమాల్లో సంఘం ఖమ్మం జిల్లా అధ్యక్షుడు మడుపల్లి లక్ష్మణ్, నాయకులు నాగులమీరా, మధు, శివనాయక్, మనోజ్, రాకేశ్, ప్రతాప్, రోహిత్, గోపి, సాయి, నరేశ్, అయ్యప్ప, అజిత్, షాహీద్, వంశీ, పవన్, సాయి, వినయ్ తదితరులు పాల్గొన్నారు.